

# స్థాన విలువ

‘ఇరవై ఇంటూ రెండు నలభై కాదు. ఈ విషయంలో ఆంధ్రులమే కాదు. చాలామంది భారతీయులు కూడా పొరబడుతున్నారని నా అనుమానం.

సి.సి.ఆర్.టి. పంపున లండన్‌లో ట్రెయినింగ్‌కి వెళ్ళిన మాకు, అక్కడి ప్రొఫెసర్ ఈ విషయం గుర్తు చేసేదాకా తెలియదు.

“ఒక సందర్భాన నేను థర్టీన్ ఇంటు టు ట్వంటీ సిక్స్ (13×22=26) అంటే, సదరు ప్రొఫెసరు వారు ఫిఫ్టీన్ (13+2=15) అని వ్రాశారు. నేను ఆశ్చర్యంలో నుండి తేరుకోకుండానే అతను ‘మిస్టర్‌రామ్ ! ఇట్స్ అబ్సల్యూట్ రైట్ ! ఇంటూ రెస్ట్స్ ఫర్ యాడ్ (n.o rests for add) దట్సాల్ అన్నారాయన. నాతో పాటు ఉన్న మిగతా భారతీయ ప్రొఫెసర్లు కూడా విషయం అర్థం చేసుకొని ఆశ్చర్యపోయారు.

“అందుకే నేను ఉపాధ్యాయుల్తో మనవి చేసేదేంటంటే ఏ విషయమైనా బాగా అర్థంచేసుకొని విధ్యార్థులకు చెప్పండి. ఇన్‌టు అనే పదం మనం షరైన సెన్స్‌లో వాడట్లేదు. ట్వటీ మల్టిపుల్డ్ బై టు అనాలి.”

రెండ్రోజుల క్రితం డి.ఇ.ఓ. స్కూల్ ఇన్‌స్పెక్షన్ చేసినప్పుడు అన్న మాటలు మళ్ళీ మళ్ళీ బుర్రలో కదులుతున్నాయి. ఆయనగారి అనుభవాలు విన్నాక మన పెద్దలు మాతృభాష లోనే విద్యాబోధన చేయాలని ఎందుకంతగా నొక్కి చెప్పారో అర్థమౌతోంది.

ఉదయం సెషన్‌లో చివరి పీరియడ్‌ను సూచిస్తూ గంట మోగింది. తరగతి గదిలోకి వెళ్ళబోతూ ఒక్కసారి స్టాఫ్‌రూమ్ గోడకున్న అద్దంలో చూసుకున్నాను. గమనించి చూస్తే నాకే మార్పు కనిపిస్తున్నది. ఇంతకు మునుపెన్నడూ అంత పరిశీలనగా చూసుకోలేదో,

ఆ పరిశీలనలో అంత పరిశీలనగా చూసుకోలేదో కాని, పక్షం రోజులుగా నా మొహంలో ఆకర్షణ పెరుగుతున్నట్లు మాత్రం అర్థమౌతుంది.

కళ్ల కింద చారలు బాగా తగ్గిపోయాయి. మొహంలో నేవళ మొస్తున్నది. మేకప్ పట్ల పెరిగిన ఆసక్తి కూడా యధాశక్తి తోడ్పడుతున్నట్లుంది. కాటుకతో పెట్టుకున్న చుక్క బొట్టు క్రిందున్న కుంకుం బొట్టును సరిచేసుకుంటున్నాను.

"ఏమిటి ? రాధాదేవి గారింకా అద్దం మందే ఉన్నారు. బెల్లు వినబళ్లేదా ?" రేవతి పలకరింపుతో ఉలిక్కిపడ్డాను. చొరవ, సరదా తన జన్మహక్కులా భావిస్తుంది. ఉత్తి గడుసుది.

"కంట్లో.... ఏదో..." నసుగుతూ కంట్లో ఏదో పడితే చూసుకుంటున్నట్లు నటించాను.

"నాకు తెలుసులే, రాజాచంద్రగారితో స్నేహం నీలో గొప్ప మార్పు తెచ్చింది."

ఆ తర్వాత ఇంకేమేం మాట్లాడుతుందో నాకు తెలుసు కాబట్టి వినబడనట్లే గబగబా తరగతి గదివైపు అడుగులేశాను.

❋ ❋ ❋

తోటరాముడ్ని చూసి రాజకుమారి మనసు పారేసుకుందని, చిత్రపటంలోని మన్మధాకారం చూసి ఓ సుకుమారి హృదయాన్ని అర్పించేసిందని, మానవుడ్ని వరించిన ఊర్వశి స్వర్గాన్నే కాలదన్నేసిందని చదువుకొన్నపుడు ఛ ! అంతా ట్రాష్ ! అని, యువతలో లేనిపోని వికారాలు కల్పించేందుకు కవులు పన్నిన మాయాజాల మనుకున్నాను. కాని రాజాచంద్రను చూశాక....

ఎనిమిదేళ్ళ క్రితం, జీవితాన్ని అర్థం చేసుకోలేని వయసులో ఓ రాతిబండకు అంటగడితే, పోరాటమే జీవితమనుకునే తను ఆ బతుకుతో రాజీ పడలేక, అత్తగారిల్లనే మృత్యుగహ్వరం నుండి బయటి కొచ్చేసింది. తండ్రి చనిపోయిన తమ కుటుంబ నౌకకు తనే చుక్కానిగా నిలిచింది. పట్టుదలగా పరీక్షలు పాసై ప్రభుత్వోద్యోగం సంపాదించింది. చెల్లి పెళ్లి చేసింది. జీవితమంతా ఒంటరిగా బ్రతకాలని ఏనాడో నిర్ణయించేసుకుంది. కాని రాజాచంద్ర పరిచయం ఇలా ఆశల పల్లకిని చూపిస్తుందనుకోలేదు.

మాయని చిరునవ్వు . తేనెలొలికే పలకరింపు, కల్మషం లేని ఆరాధన, ముఖ్యంగా తన భావాల్ని పొల్లు పోకుండా చదివేయడం అతనికి మరింత చేరువ చేసింది.

గడకర్రలా గడుస్తుందనుకున్న తన జీవితం పూలతీగెలా మారుతుండటం నమ్మాల్సిన వాస్తవం. ఈ మార్పు ముఖ్యంగా అమ్మను ఎంతో ఆనందింపజేస్తున్నది. అయితే ఒక్కటే అవరోధం, అతడు వివాహితుడు, భార్యతో కాపురం చేస్తున్నాడు !

ఆ ఊహ కలగ్గానే మనసు వికలమైపోతుంది. మధురోహల పర్జన్యాలు గాలి తాకిడికి దూదిపింజలై పోయిన భావన మనసును కుదిపేస్తుంది. మళ్ళీ అంతలోనే మనసు నచ్చజేప్పే ప్రయత్నం చేస్తుంది. ఈ ప్రపంచంలో ఎంతమంది రెండు పెళ్లిళ్లు చేసుకున్న వాళ్లు లేరు ? ఎక్కడో ఓ మహానుభావుడు అరవై ఎనిమిదో అర్థాంగి.... (సారీ, అర్థాంగి అనకూడదేమో) 68 వ ఆలిని చేసుకొని హాయిగా కాపురం చేస్తున్నాడని చదివింది.

చట్టాలు, కట్టుబాట్లు, సమాజం మనసును కట్టేయలేవు కదా ? !

పైగా తను భార్యాబాధితుడు. ఆ విషయం తానే స్వయంగా ఎన్నోసార్లు చెప్పాడు. ఆ చెప్పడంలో నిజం లేకపోలేదనే విషయం తానూ గ్రహించింది. ఇది తనకు అనుకూలించే అంశం. అందం, అణకువ, ఆత్మీయత తనకున్న ప్లస్ పాయింట్స్.

ఏమైనా ఈ సాహసం చేయడానికే నిర్ణయించుకున్నాను. నా నిర్ణయం ఆయనకు ఎంతో ఆనందాన్నిస్తుంది. పోనీ, ఆయన ఆనందం కోసమైనా తను సమస్యల్ని సంతోషంగా స్వీకరిస్తుంది....

"ఏంటే, తొమ్మిది గావస్తూంది, ఇంకా తయారవలేదు. ఈ రోజు బడికి సెలవా?" అమ్మ మందలింపుతో ఈ లోకంలో కొచ్చాను. బడికి తయారయ్యే యంత్రంగా మారుతూ.

❋ ❋ ❋

"హాలో గడ్ మార్నింగ్ ! కాస్త మా లోకంవైపు కూడా చూడండి మేడం !"

తలవంచుకొని ఆలోచనామగ్నమై నడుస్తున్న నేను హఠాత్తుగా అమృతోపమానమైన ఆ కంఠస్వరానికి ఉలిక్కిపడ్డాను. భయంతో కాదు; హృదయ తంత్రుల్ని మీటినప్పుడు కలిగే గుబులది.

ఎదురుగా చిరునవ్వే తానుగా రాజాచంద్ర !

రెండుచేతులూ జోడించి ప్రతి నమస్కారం చేశాను.

"ఏమిటి సమాధాన మాలోచించుకునేందుకు ఇన్ని రోజులా ?"

డైరక్టుగా ఆయన ఆ ప్రస్తావన తెచ్చేసరికి కొంచెం ఇబ్బందిపడిపోయాను. కరెక్టే ఆ విషయం ఆయనడిగి అప్పుడే వారం కావస్తుంది. పాఠశాల అవరణ అది, విద్యార్థులంతా వచ్చేస్తున్నారు.

"ఇబ్బందేం లేదు. సారీ !" నేనాలోచించడాన్ని ఠక్కున పట్టేశాడు. అదే అతని ప్రత్యేకత.

'ఏమో ! నేను నిర్ణయం తీసుకోవడంలో ఆలస్యమైతే ఓ అమూల్యమైన అవకాశం జారి పోతుందేమో !' ఈ ఆలోచన రాగానే గబుక్కున అనేశాను– "రేపు సాయంత్రంలోపు చెప్పేస్తాను."

❄ ❄ ❄

రాత్రంతా ఆలోచించుకొని ఓ నిర్ణయానికొచ్చేశాను. కాకపోతే ఎలా చెప్పాలో తోచడం లేదు. అదే మరొకరి విషయమైతే తన మేధస్సంతా ఉపయోగించి చాలా ప్లాన్డ్‌గా, అద్భుతంగా ఎస్టాబ్లిష్ చేసేదే, కాని, స్వవిషయం ఇబ్బందికరంగా ఉంటుందనుకోలేదు.

మరో అరగంటలో పాఠశాల సమయం ముగుస్తుంది. ఈ లోపునే చెప్పేయాలి. అప్పుడు తోచింది. చిన్న స్లిప్ ద్వారా తెలియజేస్తే బాగుంటుందని.

పేజీ నిడివి, నాలుగంగుళాల వెడల్పు గల ఒక కాగితం ముక్కను తీసుకున్నాను. నా నిర్ణయంతో పాటు క్లుప్తంగా అభిప్రాయాలు కూడా వ్రాయలి కాబట్టి.

"డియర్ చంద్రా !..."

"టీచర్ ! మీకు లెటర్ !"

ఒక అబ్బాయి ఇన్‌లెండ్ లెటరొకటి తెచ్చి ఇచ్చాడు. ఫ్రమ్ అడ్రస్ చూశాను. 'రాజేశ్వరి'

వ్రాస్తున్న లేఖను ఆపేసి, ఇన్‌లాండ్ లెటర్‌ను చించి, గబగబా మడతలు విప్పాను. రాజీతో నాకున్న అనుబంధం అలాంటిది మరి. అది నా బహిఃప్రాణం !

"డియర్ రాధా !

క్షేమం. నీ లేఖ అందింది. నీ మనస్తాపం అర్థమైంది. ఏమైనా నీలో మార్పుకు నిన్ను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.

ఎడారి అనుకున్న నీ జీవితంలో చలి చెలమలూరించిన నీ సుధా 'చంద్రు'డికి కృతజ్ఞతలు !

అనుభవజ్ఞురాలివి ఆదర్శవంతమైన స్థానంలో ఉన్నదానివి, నీవు నన్ను సలహా అడగటం కేవలం నా మీద అభిమానమే. నిర్ణయం తీసుకునే హక్కు, అధికారం నీకే ఉన్నాయి. నేను చెప్పగలదాన్ని కాను. కాని ఒక స్నేహితురాలిగా నీకీ విషయం చెప్పడం అవసరమనుకొని వ్రాస్తున్నాను. అపార్థం చేసుకోకు.

నీవు గణితం బోధిస్తావు కదా ! ఒక అంకె విడిగా ఉంటే దాని విలువ పరిమితం. కాని, అది ఉండే స్థానాన్ని బట్టి విలువ పెరుగుతుంది.

రాజాచంద్రగారు ఒకటి అనుకుందాం. ఆయన ఇల్లాలు ఏ క్వాలిటీ లేనిది (అనేకదా వ్రాశావు) కాబట్టి జీరో అనుకుందాం. వాళ్లిద్దరూ ఒక్కటిగా ఉన్నారు కాబట్టి ఆవిడగారు జీరో అయినా విలువైందే అయింది, అవునా ?

నీవు చాలా విలువైనదానివని, నీవు తొమ్మిది అనుకుందాం. అప్పుడేమైంది ? పది ప్రక్కన నువ్వు చేరితే నీ విలువ మారలేదు. కాని, పై రెండంకెల విలువ పెరుగుతుంది.

అంతేకాదు, ఆ తర్వాత వాళ్లిద్దరికీ సంతానం అనే అంకెలు నీ కంటె ముందే దూరుతాయి కాని, నీ తర్వాత చేరవు.

ఇది నా ఊహ కాదని, ఆలోచించి చూస్తే ఇందులోని నిజాలు నీకే బోధపడ్తాయని నమ్ముతున్నాను. నోమోర్ టు పెన్ ! లుక్ అండ్ ప్రొసీడ్ !

నీ

రాజీ

ఆలోచిస్తూ 'ఉండిపోయా'న్నేను

**(18-9-1996, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక)**